క్లుప్తంగా

నేటి నుంచి షాహిద్ బాబా ఉరుసు



విద్యుత్ దీపాలంకరణలో దర్గాకు వెళ్లే మార్గం

చిన్నమండెం : మండల కేంద్రంలోని హజరత్ షా అలీ గంజే షాహిద్‌బాబా రహంతుల్లా అలైహి దర్గాలో నేటి(సోమవారం) నుంచి రెండు రోజులపాటు ఉరుసు ఉత్సవాలను నిర్వాహకులు చేయనున్నారు. ఇప్పటికే దర్గాను సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలంకరణలు, వివిధ రంగులతో ముస్తాబు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే ఈ కార్యక్రమాలకు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు కార్యక్రమాలు జరుపనున్నారు. భక్తాదులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

పెనగలూరు (ఓబులవారిపల్లె) : నేడు సోమవారం పెనగలూరు మండలానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు రానున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలో జగనన్న కాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వారు తెలియజేశారు. జగనన్న కాలనీలు పొందిన లబ్ధిదారులందరూ మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి రావాలని కోరారు. ఎమ్మెల్యేతోపాటు వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి కార్యక్రమానికి హాజరుకానున్నట్లు చెప్పారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనాలు తనిఖీలో ఎస్ఐ అబ్దుల్ జహీర్

నందలూరు(రాజంపేట): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, ఏదైనా ప్రమాదం వాటిల్లినప్పుడు రక్షణ కవచంలా హెల్మెట్ సంరక్షిస్తుందని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కడప – చెన్నై హైవేలోని చెక్‌పోస్టు సమీపంలో ఆయన వాహనాల తనిఖీ జరిపారు. సంబంధిత పత్రాలు లేని వాహనదారులు పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు అన్ని కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు కార్తీక్

సిద్దవటం : కడపకు చెందిన వీరభద్ర ఆసుపత్రి జనరల్ వైద్యుడు అందెల కార్తీక్ ఆధ్వర్యంలో 126 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక వైద్యుడు లక్ష్మీనారాయణ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం – 1 గ్రామ పంచాయతీలోని శాంతి హెల్త్ కేర్ సహకారంతో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుడు అందెల కార్తీక్ వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వ్యాధిగ్రస్తులకు మ్యాన్ కైన్డ్ ఫార్మా వారి ఆధ్వర్యంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారన్నారు. అనంతరం వైద్యుడిని మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి శాలువా కప్పి సన్మానించారు.

కోనేరులో పూడికతీత పనులు



కోనేరులో పూడిక తీస్తున్న గ్రామస్తులు

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామికోన, పంచలింగాల వద్ద ఉన్న తాగునీటి కోనేరులో ఆదివారం మాచుపల్లి గ్రామస్తులు పూడికతీత పనులు చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్యపూజస్వామి కోనకు వచ్చే భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో మాచుపల్లె గ్రామస్తులు పంచలింగాల వద్ద ఉన్న కోనేరులో పూడికతీత పనులు జరిపామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది భక్తులను దృష్టిలో ఉంచుకొని తాము శివరాత్రి ఉత్సవాలకు వారం రోజుల ముందు ఈ కోనేరులో కలుషితమైన నీటిని మోటార్లతో బయటకు పంపి, పూడిక తీసి కోనేరును శుభ్రంగా ఉంచుతామని వారు తెలియజేశారు.

దుప్పట్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం : తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కర్నాటక రాష్ట్రం హొస్‌కోట సమీపంలో ఉన్న విద్యారణ్య ఆశ్రమంలోని 280 మందికి దుప్పట్లు, టవళ్లను ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ పంపిణీ చేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- అన్ని మండలాల్లో 95 శాతానికి పైగా పూర్తయిన పల్స్ పోలియో కార్యక్రమం
- మిగిలిన రెండు రోజుల్లో 100 శాతం పూర్తికి సన్నాహాలు
- రైల్వేకోడూరులో పోలియో చుక్కలు వేసిన విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు: పోలియో చుక్కలు వేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



లక్కిరెడ్డిపల్లె: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ, మాజీ ఎంపీపీలు



పుల్లంపేట: పల్స్ పోలియోను ప్రారంభిస్తున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, వైద్య సిబ్బంది



పెనగలూరు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ



రాయచోటి అర్బన్: పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా



ఓబులవారిపల్లెలో..



సంబేపల్లెలో..



రాజంపేట: టీకాలు వేస్తున్న దండు గోపి



వీరబల్లెలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి



నందలూరు మండలం ఎస్‌టీపల్లెలో..



సిద్దవటం: పోలియో చుక్కలు వేస్తున్న బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్

రైల్వేకోడూరు : పోలియోను అరికట్టడానికి అందరూ సహకరించాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. స్థానిక పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. నిండు జీవితానికి కేవలం రెండు పోలియో చుక్కలే ఆధారమని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37వేల 921 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గంలో 298 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసి గ్రామ, పట్టణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు. అలాగే పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులను గుర్తించి 4, 5 తేదీలలో వారికి పల్స్ పోలియో చుక్కలు వేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ మండల నాగేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ శేఖర్, జెడ్పీటీసీ రత్నమ్మ, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, ముజీబ్, గునిశెట్టి రమేష్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ పుష్పలత, రత్తయ్య, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : నిండు జీవితానికి రెండు చుక్కలు అవసరమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డితో కలసి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. సంబేపల్లె పీహెచ్‌సీ పరిధిలో 2171 మంది పిల్లలకుగాను 2127 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. దీంతో 98 శాతం నమోదైనట్లు వైద్యాధికారులు సూర్యనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డిలు తెలిపారు. అలాగే దేవపట్ల ఆరోగ్య కేంద్రం పరిధిలో 1923 మందికి గాను 1825 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. దీంతో95శాతం నమోదైనట్లు వారు తెలిపారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : పోలియో రహిత సమాజం నిర్మాణం కోసం అందరం సమష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ ఉర్దూ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. తద్వారా పిల్లలు పోలియో బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, వైఎస్ఆర్‌సీపీ నేత రియాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో పోలియో చుక్కలు వేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు సతీష్‌కుమార్ సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథరెడ్డి, సభ్యులు నారాయణరెడ్డి, సుకుమార్, చాన్‌బాషాతో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక నేతాజీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. శిబిరంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్): మీ పిల్లలకు ఇచ్చే రెండు చుక్కల పోలియో చుక్కలే మీ పిల్లలను పోలియో నుంచి కాపాడుతుందని ఎంపీపీ గాలివీడు రాజేంద్రనాథరెడ్డి అన్నారు. ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మొదటి రోజు మండల స్థాయిలో 3917 మంది చిన్నారులకు గాను 66 పోలియో బూతుల ద్వారా 3678 మందికి వేసినట్లు అధికారులు తెలిపారు.

పల్స్‌పోలియో విజయవంతం

చిన్నమండెం : మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండల వ్యాప్తంగా 21 కేంద్రాలు, ఒక మొబైల్ కేంద్రం ద్వార 1798 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేసినట్లు చిన్నమండెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.సునీతా రెడ్డి తెలిపారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాలలో వేయనున్నట్లు తెలిపారు.

పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలి

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలాన్ని పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలని మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కొండూరులో పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రభావతమ్మ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పెనగలూరు మండలంతోపాటు రాష్ట్రాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. మండలంలో 4250 మంది 0 నుండి 5 సంవత్సరాల వారు ఉన్నారని, వందశాతం చుక్కలు వేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తౌషీఫ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : నిండు జీవితానికి రెండు చుక్కలు ఆధారమని డాక్టర్ సానే శేఖర్, డాక్టర్ మనోజ్ చంద్రలు అన్నారు. ఆదివారం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కలు చిన్నారులకు వేశారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు పల్స్ పోలియో చుక్కలను చిన్నారులకు వేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కుమారి, పి.మహేష్, సుబ్బారెడ్డి, శరత్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట): ప్రతి తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని సృష్టించేందుకు సహకరించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గీతాల నరసింహారెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సూర్యనారాయణలు అన్నారు. నల్లతిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని సర్పంచ్ గీతాల శిరీషా, నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : మున్సిపాలిటీ పరిధిలోని రాయచోటి రోడ్డులోని పాత డీఎస్పీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారిని తరిమికొట్టాలంటే చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుశీలమ్మ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె మండలంలో 99 శాతం పూర్తి

ఓబులవారిపల్లె : మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 99శాతం విజయవంతమైనట్లు వైద్యాధికారి గురు మహేష్ తెలిపారు. మండలంలో ఉదయం 5 గంటల నుంచి ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వార అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లందరికీ పోలియో చుక్కలను వేశారు. మండల వ్యాప్తంగా 6 వేల మంది పిల్లలకుగాను 5820 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైకోట వైద్యాధికారి దేవేంద్రరెడ్డి తెలిపారు. వైకోట గ్రామంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ పోలియో చుక్కలు వేశారు. మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ కొమ్మూరు సుమిత్ర చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజశేఖర్, సీహెచ్ఓ నాగేష్, ఫార్మసిస్టు లక్ష్మీదేవి, అంగన్‌వాడీ టీచర్ జరీనా, ఏఎన్ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : పోలియో రహిత సమాజ స్థాపనకు అందరూ సహకరించాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వారు స్థానిక నాయకులతో కలిసి పోలియో చుక్కలు వేశారు. 99.7 శాతం పోలియో చుక్కలను వేశామని, మిగిలిన 7 మందికి పోలియో చుక్కలు వేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీలు దస్తగిరి, లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు, సర్పంచ్ జనార్దన్ రెడ్డి, రవి ఆచారి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, ఖాజా, సైమన్, నారద, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో

సిద్దవటం : 0 – 5 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను తప్పకుండా వారి తల్లిదండ్రులు వేయించాలని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో ఉండే యూనిట్ ఆసుపత్రిలో యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యరాణి, వారి సిబ్బంది సహకారంతో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని కమాండెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి.ఎన్.డి. ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ కె.వి.ఎస్.ఎస్ అనిల్, పల్స్ పోలియో అబ్జర్వర్ డాక్టర్ ఆనంద్, ఆర్థోపెడిక్ ఎంవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయం



రంగులతో కొత్త సొబగులద్దుకున్న శివాలయం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రంలో ఉన్న పురాతన కాలం నాటి శివాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయం గోపురానికి మరమ్మతులు చేసి ఆలయానికి రంగులు వేయించారు. ఈ రంగులను పెనగలూరు గ్రామానికి చెందిన కొత్త మధుసూదన రావు, శాంతి జ్యోతి దంపతులు రూ. 5 లక్షలతో రంగులు, ఇతర పనులను చేయించారు. కామాక్షి గోపురానికి గ్రామస్తుల సహకారంతో రూ. 70 వేలతో నూతన శిలలను ఏర్పాటు చేయించినట్లు గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడ్డిలు తెలిపారు. ఈ ఆలయంలోని శివాలయం ఎక్కడా లేని విధంగా బ్రహ్మసూత్రాలు కలిగి అత్యంత శక్తివంతమైన శివాలయంగా పేరుగాంచింది. మహా శివరాత్రి సందర్భంగా రోజూ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 8వ తేదీ ఆలయ పూజారి కుందవరం రామలింగయ్య, వరలక్ష్మమ్మ దంపతులు కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం గ్రామస్తుల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.

ముగిసిన విద్యా వైజ్ఞానిక సంబరాలు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్

సిద్దవటం : మండల కేంద్రంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించిన విద్యా వైజ్ఞానిక సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను వసతి గృహం విద్యార్థులు, పలు పాఠశాలలోకు చెందిన విద్యార్థులు సందర్శించారు. అంతేగాకుండా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్, రిటైర్డు పంచాయతీ రాజ్ ఇంజనీర్ శేషారెడ్డి, జేవీవీ సభ్యుడు, మెజీషియన్ సుజన్‌కుమార్, జేవీవీ రాష్ట్ర కమిటీసభ్యుడు దేవదత్తం, ఫౌండర్ ఆఫ్ సీహెచ్ఆర్‌డీ, అండ్ చైర్మన్ శివారెడ్డి, జేవీవీ సెక్రటరీ బాలబయన్నలు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు.

రిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గంగాదేవి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ముద్రపల్లె పంచాయతీ కడియంవారిపల్లెకు చెందిన సుంకేసుల నాగూర్ సాహెబ్ కడప రిమ్స్‌లో గత 11 రోజులుగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. సోమవారం ఆపరేషన్ ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేయడంతో వలంటీర్ గంగాదేవి సొంత ఖర్చులతో కడప రిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేసింది. కడప రిమ్స్‌కు వెళ్లి పించన్ పంపిణీ చేసిన వలంటీర్‌ను సర్పంచ్ శివయ్య నాయుడు అభినందించారు.

8 నుంచి శివరాత్రి ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. 8న వివిధ పూజలు, అభిషేకాలు, 9న శివ పార్వతుల కళ్యాణోత్సవం, 10న రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఉత్సవాలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు చేశారు.


శ్మశాన వాటిక అభివృద్ధికి పూర్తి సహకారం



వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

రైల్వేకోడూరు అర్బన్ : రాఘవరాజుపురంలోని ముస్లిం సోదరులకు అన్ని విధాల సహకరిస్తామని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక ముస్లిం సీనియర్ నాయకులు షేక్ షావలి ఇంటి వద్ద ముస్లిం మైనార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు వైస్ ఎంపీపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ముస్లిం స్మశానవాటిక ప్రహరీ గోడ అలాగే మినార్‌ను తన సొంత నిధులతో నిర్మిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికలలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేక్ షా వలి, ముజీబ్, అబ్దుల్ రౌఫ్, రియాజ్, ఇర్ఫాన్, మస్తాన్, జిలాని, వర్ష మస్తాన్, కరీముల్లా, ఫరూక్, రాజగోపాల్, క్రిష్టారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత



భాకరాపేట గ్రామ శివారులో డ్రైనేజీ పనులు చేస్తున్న దృశ్యం

సిద్దవటం : పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డిలు తెలిపారు. ఆదివారం వారు మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో ఉన్న శివాలయం వద్ద మురికి కాలువలో పూడికతీత పనులను చేయించారు. మురికి కాలువల్లో నీరు నిలువ ఉండకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలానే డ్రైనేజీ నీరు రోడ్డుపై రాకుండా ఉండేందుకు కాలువ ఎత్తును పెంచుతున్నామన్నారు.

నల్లగంగమ్మకు బోనాలు.. జగతికి భాగ్యాలు



సంబేపల్లె: ప్రత్యేక అలంకారంలో నల్లగంగమ్మ



అనంతపురం గంగమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రం పరిధిలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లికి ఆదివారం మహిళలు, భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు.

భక్తులతో పోటెత్తిన అనంతపురం గంగమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ దేవత ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించుకున్నారు. క్యూలైన్ల ద్వారా అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పింపజేసి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సీసీ కెమెరాల కనుసన్నల్లో ఈ ఏడాది గంగమ్మ జాతరను పటిష్టంగా నిర్వహించనున్నట్లు ప్రత్యేక అధికారి రవీంద్రరాజు తెలిపారు. ఇప్పటికే గంగమ్మ దేవత ఆలయం ఆవరణలో మొత్తం 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మార్చి 10, 11, 12న జరగబోవు గంగమ్మ జాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ముందు భాగంలో రూ. 20 లక్షల పైబడి ఆలయ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను జరిపారు.

పది విద్యార్థులకు ప్రణాళిక అవసరం

కేవీపల్లె : పది విద్యార్థులు మంచి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్ర, పూర్వ విద్యార్థి ప్రవీణ్ అన్నారు. ఆదివారం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ సారథ్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కెరీర్ గైడెన్స్ బుక్స్, పెన్నులు, ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం స్విమ్స్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరీటి, పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేంద్ర విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు.

పల్స్ పోలియో విజయవంతం



పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

గాలివీడు : మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు గాలివీడు, నూలివీడు వైద్యులు రఫీ, రాధమాధవి, శంకర్ నాయక్, స్రవంతిలు పేర్కొన్నారు. 17 గ్రామాలలో 5,019 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు. నూలివీడు బస్టాండులోని పోలియో కేంద్రంలో సర్పంచ్ ఉమాపతిరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా గ్రామాల పరిధిలో ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు.